AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
25-3-2026 (Wednesday) MAIN EDITION

## ఏప్రిల్ 1 నుంచి చికెన్ షాపులు బంద్!



**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** చికెన్ షాపుల నిర్వాహకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. పౌల్ట్రీ కంపెనీల తీరుకు నిరసనగా ఏప్రిల్ 1 నుంచి దుకాణాలు బంద్ చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ పేరిట హైదరాబాద్ నగరంలో పోస్టర్లు అంటించారు. హైదరాబాద్ నగరంలోని ఉప్పల్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో చికెన్ షాపుల ఓనర్లు పోస్టర్లు అంటించారు. ఏప్రిల్ 1 నుంచి దుకాణాలు మూసి వేయనున్నట్లు అందులో పేర్కొన్నారు. కంపెనీలు తమకు ఇచ్చే మార్జిన్‌ను భారీగా తగ్గించాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## 23 మంది సభ్యులతో అన్నాడీఎంకే తొలి జాబితా



**అక్షరటుడే, చెన్నై:** అసెంబ్లీ ఎన్నికలకు సమయం ఆసన్నమవుతోంది. ఈ నేపథ్యంలో పలు పార్టీలు వారి అభ్యర్థుల జాబితాలను విడుదల చేస్తున్నాయి. తాజాగా తమిళనాడు నుంచి అన్నాడీఎంకే పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు 23 మంది సభ్యులతో కూడిన తొలి జాబితాను విడుదల చేసింది. కాగా.. ఏప్రిల్ 23న తమిళనాట పోలింగ్ జరుగనుంది.

## రేవంత్ సిద్దిపేట నుంచి పోటీచేయాలి



**అక్షరటుడే, హైదరాబాద్:** తలకిందులుగా తపస్సు చేసినా రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కాలేడని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ఏ టైంలో గోల్ కొట్టాలో మాకు బాగా తెలుసన్నారు. ఎలక్షన్ ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్‌దే గెలుపని ధీమా వ్యక్తం చేశారు. సిద్దిపేటలో పోటీకి ఎవరినో పెట్టడం ఎందుకు రేవంత్ రెడ్డే రావచ్చు అని సవాల్ విసిరారు.

## పెట్రోల్ ధరలు పెరగవు..: కేంద్రం



**అక్షరటుడే, ఢిల్లీ:** దేశంలో తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని కేంద్రం తెలిపింది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగబోవని పేర్కొంది. పుకార్లను నమ్మి పెట్రోల్ బంకులకు పరుగులు తీవద్దని పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రెటరీ సుజాత శర్మ కోరారు. అలాగే పీఎన్జీ కనెక్షన్లకు అవకాశం ఉన్నా.. వినియోగించుకోని వారికి ఎల్‌పీజీ కనెక్షన్లు కట్ చేస్తామన్నారు.

## ఉద్రిక్తతలకు ముగింపు దిశగా అడుగులు..



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** మధ్యప్రాచ్యంలో యుద్ధం నాలుగో వారానికి చేరుకున్న నేపథ్యంలో పరిణామాలు కీలక మలుపు తిరిగాయి. ఇప్పటివరకు కఠిన వైఖరి అవలంభించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా దౌత్యపరమైన మార్గాన్ని ఎంచుకున్నారు. యుద్ధానికి ముగింపు పలికే ఉద్దేశంతో ఇరాన్‌కు శాంతి ప్రణాళికను పంపినట్లు ప్రకటించారు.



## ఓఖా–తిరుపతి వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లో మార్పులు

**అక్షరటుడే, హైదరాబాద్:** తిరుపతి నుంచి ఓఖా మధ్య నడిచే ప్రత్యేక వీక్లీ ఎక్స్ ప్రెస్ రైలును అధికారులు క్రమబద్ధీకరిం చారు. క్రమబద్ధీకరించిన రైలు నంబర్‌ను 19559/60 గా మార్చారు. మదురై నుంచి ఓఖా మధ్య ప్రత్యేక వీక్లీ ఎక్స్ ప్రెస్ రైలుగా నడుస్తుంది. ఈ రైలు సంఖ్య 09520/19. అయితే తాజాగా దీనిని క్రమబద్ధీకరించారు. దీని ముగింపు స్టేషన్‌ను మధురై నుంచి తిరుపతికి మార్చారు. ఇప్పటికే ఇదే మార్గంలో వారానికి ఒక రోజు చొప్పున ఓఖా నుంచి రామేశ్వరం ఎక్స్ ప్రెస్ రైలు (16734/33) నడుస్తుంది.

## ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

**అక్షరటుడే, హైదరాబాద్:** శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయింది. బుధవారం ఉదయం 63 మంది ప్రయాణికులతో జగదల్‌పూర్‌కు ఫ్లైట్ బయలు దేరింది. అక్కడకు వెళ్లిన తర్వాత వాతావరణం అనుకూలించలేదు. దీంతో అక్కడ విమానం ల్యాండ్ కాలేదు. తిరిగి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చింది. అనంతరం పైలెట్ సురక్షితంగా విమానాన్ని ల్యాండ్ చేశారు. ఈ ఘటనతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

# జీవన్‌రెడ్డి రాజీనామా

**మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. అనుచరులు, మద్దతుదారుల సమక్షంలో రాజీనామా లేఖను విడుదల చేశారు. ఇన్నాళ్లు అవమనాలు భరించానని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు పార్టీ అండగా లేదన్నారు. రేవంత్‌రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయనపై పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. –అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



- కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పిన మాజీ మంత్రి
- రేవంత్‌రెడ్డిపై పోరాటం చేస్తానని వెల్లడి
- పార్టీ అండగా లేదని ఆవేదన

జీవన్‌రెడ్డి కొంతకాలంగా అధిష్టానంపై అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు ప్రాధాన్యత ఇచ్చి, తనను పట్టించుకోకపోవడంపై ఆయన ఆగ్రహంగా ఉన్నారు. ఈ క్రమంలో పార్టీ మారుతానని ప్రకటించారు. మంత్రులు, ఏఐసీసీ పెద్దలు బుజ్జగించినా ఆయన వెనక్కి తగ్గలేదు. బుధవారం జగిత్యాలలో కార్యకర్తలతో సమావేశం అయ్యారు. తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

### బాధతో పార్టీని వీడుతున్నా..

పార్టీ ఫిరాయింపులు మంచిది కాదని చెప్పినా వినిపించుకోలేదని జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాలలో ఎమ్మెల్యేను పార్టీలోకి తీసుకోవద్దని చెప్పినా వినలేదని పేర్కొన్నారు. తాను, తన కార్యకర్తలు అనేక ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రమైన బాధతో పార్టీని వీడుతున్నానని ప్రకటించారు.

### సీఎం తీరుపై విమర్శలు

దానం నాగేందర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ, కాంగ్రెస్ గుర్తుపై ఎంపీగా పోటీ చేయడం దేనికి సంకేతమని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. ఆయనను రాజీనామా చేయించి పోటీ చేయించాల్సిందని చెప్పారు. అందుకే సికింద్రాబాద్ ఎంపీ సీటును కాంగ్రెస్ ఓడిపోయిందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలతో ఆయన సొంత పార్లమెంట్ మహబూబ్ నగర్‌లో పార్టీ ఓడిపోయిందన్నారు. తాను రేవంత్ రెడ్డిని ఎదిరించి పోరాటం చేస్తానని చెప్పారు. ఆయనతో అణగదొక్కించుకోవడం కంటే పోరాటం చేస్తే తనకు పోయేది ఏమి లేదన్నారు.

### వారికే పదవులు

సీఎం రేవంత్‌రెడ్డి అడుగులకు మడుగులు ఒత్తే వారికి పదవులు ఇస్తున్నారని జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించే వారిని పక్కన పెడుతున్నారన్నారు. వేం నరేందర్ రెడ్డి ఎవరని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవ ఏమిటని ప్రశ్నించారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీకి ఏం సంబంధం అని నిలదీశారు. బతకడానికి వచ్చిన పోచారంనకు ప్రభుత్వ సలహాదారు పదవి ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ప్రభుత్వ సలహాదారుడిగా నియామకమైన తర్వాత ఇచ్చిన సలహాలు ఏమైనా ఉన్నాయా అని ఎద్దేవా చేశారు.

### ఎంతమందిని తొక్కుతావు


తనకు ఎవరైనా అడ్డం వస్తే తొక్కుతా అని రేవంత్ రెడ్డి అంటున్నారని జీవన్‌రెడ్డి అన్నారు. ఎంత మందిని తొక్కుతారని ప్రశ్నించారు. జగిత్యాలలో ఏ శక్తి తనను ఆపలేదన్నారు. కొంతమంది లాగా ముఖ్యమంత్రి అయ్యేందుకు తాను కాంగ్రెస్ పార్టీలోకి రాలేదన్నారు. రేవంత్‌రెడ్డి తమను కూడా బతకనివ్వాలన్నారు. విధి లేని పరిస్థితుల్లో రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

## ఏసీబీ ఛార్జిషీటుపై స్పందించిన కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్:** ఫార్ములా ఈ కారు రేస్ కేసులో ఏసీబీ అధికారులు సోమవారం ఛార్జిషీటు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4గా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు, ఏ5గా యూకేకి చెందిన ఎఫ్ఈవో సంస్థను ఏసీబీ చేర్చింది. దీనిపై తాజాగా 'ఎక్స్' వేదికగా కేటీఆర్ స్పందించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్ల నాలుగు నెలలు అయిందన్నారు. అన్ని పత్రాలు, ప్రభుత్వ యంత్రాంగం కాంగ్రెస్ చేతిలో ఉందని చెప్పారు. అయినా కూడా కేవలం ఫార్ములా ఈ-రేసు విషయంలో అదీ బ్యాంకు నుంచి బ్యాంకుకు నిధులు బదిలీ అయినందుకు కేసు పెట్టారని ఎద్దేవా చేశారు. ఈ ఏసీబీ ఛార్జిషీట్ రేవంత్ రెడ్డి ప్రభుత్వపు స్పష్టమైన నిస్సహాయతకు ప్రతీక అన్నారు. అంతేగాకుండా తమ పారదర్శక పాలనకు ఒక ధ్రువీకరణ పత్రం అని పేర్కొన్నారు.

## ఏడున్నర డాలర్లుంటే.. అక్కడ కోటీశ్వరులే!



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అణు కార్యక్రమం విషయంలో అమెరికాతో ఏర్పడిన విభేదాలు ఇరాన్ ఆర్థిక వ్యవస్థను నాశనం చేశాయి. అగ్రరాజ్యం ఎడాపెడా ఆంక్షలు విధించడంతో ఆ దేశ కరెన్సీ విలువ దారుణంగా పడిపోతోంది. గతనెల 28న ఇరు దేశాల మధ్య యుద్ధం ప్రారంభమైన తర్వాత పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఆ దేశ కరెన్సీ రియాల్ విలువ ఎంతగా పడిపోయిందంటే తాజాగా విడుదల చేసిన 10 మిలియన్ల రియాల్ నోటు విలువ ఏడున్నర డాలర్లు. భారత కరెన్సీలో ఈ నోటు విలువ రూ. 713 కావడం గమనార్హం. అంటే ఒక భారత రూపాయి విలువ 14,017 రియాల్స్‌కు సమానం అన్నమాట. పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా సామాన్య ప్రజలు చిన్న వస్తువులు కొనాలన్నా సంచుల కొద్దీ నగదు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఇబ్బందులను తగ్గించడానికి ఇరాన్ ప్రభుత్వం కొత్త నోట్లను ముద్రిస్తోంది. తాజాగా 10 మిలియన్ రియాల్ నోటును తీసుకువచ్చింది. ఇది ఆ దేశ చరిత్రలోనే అత్యధిక విలువ కలిగిన నోటు. ఆ దేశంలో దీని విలువ 10 మిలియన్లు అయినా.. మారకం విలువ 7.5 డాలర్లు కావడం గమనార్హం.

## వరుస ఛాన్స్‌లు కొట్టేస్తున్న యంగ్ బ్యూటీ..



**టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి. ఆయన మరో క్రేజీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్నాడు. ఈ ప్రాజెక్ట్‌లో వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా నటిస్తుండగా.. హీరోయిన్ ఎవరు అనేది? సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం నేషనల్ అవార్డు విన్నర్ కీర్తి సురేష్‌ను వెంకటేష్ సరసన ఫైనల్ చేసినట్లు సమాచారం. ఈ మల్టీ స్టారర్ మూవీలో మరో హీరోయిన్‌గా యంగ్ బ్యూటీ పేరు కూడా వినిపిస్తోంది. అమ్మడు ఎవరో కాదు.. కయ్యదు లోహర్. ఈ హీరోయిన్ పేరు కూడా బలంగా వినిపిస్తోంది. ఇటీవల ఆమె నటించిన 'ఫంకీ' సినిమా ఆశించిన స్థాయిలో సక్సెస్ కాకపోయినా, ఇండస్ట్రీలో మాత్రం వరుస అవకాశాలు దక్కించుకుంటుండడం గమనార్హం.**

**- అక్షరటుడే, సినిమాడెస్క్**

## రాష్ట్రంలో పెట్రోల్ కొరత లేదు.. డీలర్స్ అసోసియేషన్ క్లారిటీ



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు బంక్‌లకు పరుగులు తీస్తున్న విషయం తెలిసిందే. హైదరాబాద్ నగరంలోని పలు బంక్‌ల్లో స్టాక్ అయిపోయింది. మిగతా బంక్‌ల్లో వాహనదారులు భారీగా బారులు తీరారు. ఈ క్రమంలో డీలర్స్ అసిసోయేషన్ కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలో ఇంధన కొరత లేదని తెలంగాణ డీలర్స్ అసోసియేషన్ ప్రకటించింది. ఇంధన కొరతపై వస్తున్న వార్తలను ఖండించింది. పెట్రోలియం కంపెనీల్లో సరిపడా నిల్వలు ఉన్నాయని తెలిపింది. పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకోవద్దని, అవసరానికి తగ్గట్టు కొనుగోలు చేయాలని కోరింది. ఇంధన సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోందని స్పష్టం చేసింది. పెట్రోల్, డీజిల్‌లపై తప్పుడు ప్రచారాలను నమ్మొద్దంటూ ప్రకటన విడుదల చేసింది.

## హైదరాబాద్‌లో మళ్లీ ఉగ్రలింకులు వెలుగులోకి..!



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ఉగ్రవాద లింకులు మరోసారి వెలుగులోకి వచ్చాయి. తీవ్రవాద కార్యకలాపాలకు సంబంధం ఉన్నట్లు అనుమానంతో సయిదా బేగం అనే మహిళను కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ అరెస్ట్, ఇటీవల విజయవాడలో బయటపడిన ఉగ్రలింకుల కేసుతో సంబంధం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఇంతకు ముందు విజయవాడలో మహమ్మద్ రహమతుల్లా, డానిష్, సొహైల్ బేగ్ అనే ముగ్గురు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి విచారణలో వెల్లడైన సమాచారం ఆధారంగా పలు రాష్ట్రాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో కూడా ఈ నెట్‌వర్క్ కార్యకలాపాలు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు నగరంలో గాలింపు చర్యలు చేపట్టి సయిదా బేగంను పట్టుకున్నారు. ఆమెను విచారించి, మరింత దర్యాప్తు కోసం విజయవాడకు తరలించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## అనర్హత కేసు.. ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు




**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కొట్టి వేసిన విషయం తెలిసిందే. దీనిపై బీఆర్ఎస్ హైకోర్టు ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం స్పీకర్‌తో పాటు ఏడుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చింది. దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌ను కొట్టి వేయడంపై ఇప్పటికే బీజేపీ హైకోర్టును ఆశ్రయించింది. బీఆర్ఎస్ సైతం ఏడుగురు ఎమ్మెల్యేల పిటిషన్లపై పిటిషన్ వేయగా.. బుధవారం ధర్మాసనం విచారణ చేపట్టింది. వారికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని పార్టీ మారలేదన్న ఎమ్మెల్యేలను ఆదేశించింది. అనంతరం విచారణను వచ్చే నెల 16కు వాయిదా వేసింది.